క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



హన్మకొండ: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సీపీఐ (ఎంఎల్) రెవల్యూషనరీ ఇన్షియేటివ్ హనుమకొండ జిల్లా బాధ్యులు అర్షం అశోక్, ఎండీ ఉస్మాన్ పాషా, పరకాల తిరుపతి, కె.లక్ష్మయ్య, ఉమ విమర్శించారు. బాలసముద్రంలోని ఏకశిల పార్కులో వివిధ డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు.

పోలెపాక సంజీవ్‌కు డాక్టరేట్



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం భట్టుపల్లిలోని కొత్తపెల్లి గ్రామానికి చెందిన పోలెపాక సంజీవ్ ఆదివారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు. హైదరాబాద్ జేఎన్టీయూలో నిర్వహించిన పదకొండవ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ ప్రదానోత్సవంలో భాగంగా గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరించారు. జేఎన్టీయూ సీఎస్‌సీ విభాగంలో డాక్టర్ ఎం.చంద్రమోహన్ పర్యవేక్షణలో 'డెవలప్‌మెంట్ డిసిజన్ సపోర్ట్ సిస్టం టూ డిటెక్ట్ ద అబ్‌నార్మలిటీస్ ఇన్ ఎంఆర్ఐ బ్రెయిన్ ఇమేజెస్' అనే అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ అందుకున్నట్లు సంజీవ్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 1996 – 97 పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో కంచి చందు, నాగేందర్, నెల్ల రాజు, సురేష్, సీహెచ్.రాజు, ఆకుతోట రాజు, నూర కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ పరిరక్షణ సమితి కన్వీనర్‌గా కె.శ్రీనివాస్



హన్మకొండ: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి హైదరాబాద్ కన్వీనర్‌గా హనుమకొండ జిల్లాకు చెందిన కె.శ్రీనివాస్‌ను నియమించినట్లు ఆ సంఘం జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు, రాష్ట్ర కోఆర్డినేటర్ కన్నెబోయిన ఉషారాణి తెలిపారు. ఈమేరకు శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందించారు.

కాలనీ కమిటీ నూతన కార్యవర్గం

హసన్‌పర్తి: ఎర్రగట్టుగుట్ట క్రాస్‌లోని మంత్రపురి కాలనీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పావుశెట్టి శ్రీధర్, అధ్యక్షుడిగా సిరినేని మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమేష్, సంయుక్త కార్యదర్శిగా లడే గోపాల్, కోశాధికారిగా చిటికేసి సదానందం, ప్రచార కార్యదర్శిగా సురేందర్‌రెడ్డి, కార్యదర్శులుగా తోకల ప్రభాకర్‌రెడ్డి, కందుకూరి రమేష్ ఎన్నికయ్యారు.

విగ్రహావిష్కరణ కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భైరాన్‌పల్లి గ్రామంలో ప్రతిష్ఠించనున్న అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపణ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బండి అశోక్, గౌరవ అధ్యక్షుడిగా కుందూరు సాంబారెడ్డి, కోశాధికారిగా జట్టి రాజేందర్, సలహాదారులుగా కుమారస్వామి, సురేందర్, రవిపాల్, శంకర్, ఇంద్రారెడ్డి, రాజేందర్, బండి రజనీకుమార్, జయశంకర్‌తో పాటు మరో 10మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

కాజీపేట: శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కాజీపేట మండలంలోని పది గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి దొండపాటి శ్రీధర్ రెడ్డి తెలిపారు. కాజీపేట మండల వ్యవసాయ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ 300 ఎకరాల్లో మొక్కజొన్న, 500 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో మిర్చి, కూరగాయ తోటలు ధ్వంసమై ఉంటాయని అన్నారు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు గ్రామాల్లో సర్వే చేసినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతి చెందిన గౌడ సంఘం నాయకుడు బొల్లికొండ దుర్గారావు కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశ్రీరజాలీ, నాయకులు బోయిని కుమార్‌యాదవ్, గుర్రం కోటేశ్వర్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: దెబ్బతిన్న క్యాబేజీ పంట



అలంకార్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిలో నిలిచిన వరద నీరు



హనుమకొండ చౌరస్తా: జలమయం అయిన లోతట్టు కాలనీ



అకాల వర్షానికి అతలాకుతలం

శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. గాలివానకు పంటలు ధ్వంసం అయ్యాయి. ఇంటి పైకప్పులు లేచిపోయాయి. మామిడి కాయలు నేలరాలాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ సందర్భంగా బాధితులను ప్రజాప్రతినిధులు పరామర్శించారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



హసన్‌పర్తి: దెబ్బతిన పంటను పరిశీలిస్తున్న ఏఓ అనురాధ



నేలకొరిగిన మొక్కజొన్న చేను



హసన్‌పర్తి: గాలివానకు నేలరాలిన మామిడి కాయలు



మడికొండలో విరిగిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న కానిస్టేబుల్ జయరాజ్, తదితరులు



శివనగర్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



పదమరకోటలో లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు



ఖిలా వరంగల్: కూలిన విద్యుత్ స్తంభం

కలెక్టర్‌ను కలిసిన మార్కెట్ ఉద్యోగులు



వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని ఈవీఎంల గోదాంను పరిశీలించేందుకు ఆదివారం వచ్చిన వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యను టీఎన్జీవోస్ మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను భాస్కర్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, గ్రేడ్ –2 కార్యదర్శి ఎండి.బియాబానీ, మిర్చి యార్డ్ ఇన్‌చార్జ్ నర్సింహనాయక్, సాగర్ పాల్గొన్నారు.

నూతన మసీదు ప్రారంభం



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో నూతన చోటా మసీదును కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రఫీ, ఖాజా సాహెబ్, అస్గర్, సుభాన్, గౌస్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఖిలా వరంగల్: వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి కోరారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం దూపకుంటలో వర్షం కారణంగా నేలమట్టమైన మొక్కజొన్న, మిర్చి, ఇతర పంటలను సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాషుమియాతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ అకాల వర్షానికి కళ్ల ముందే పంట పాడైపోవడం బాధకరమని వాపోయారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి, మారుపాక అనిల్, దండు లక్ష్మణ్, ఓర్సు రాజు, జాన్‌పాల్, వనం సౌందర్య, జెట్టి విజయలక్ష్మి, సువర్ణ, దూమల పద్మ, జన్ను రాజు, చిరంజీవి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న వెంకటరెడ్డి, సీపీఐ నేతలు

త్వరలో ఠాణునాయక్ విగ్రహావిష్కరణ



నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు

హన్మకొండ: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం చేసిన పోరాటంలో బంజారా జాతి బిడ్డ జాటోతు ఠాణునాయక్ అసువులు బాసారని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ గుర్తు చేశారు. హనుమకొండలోని బాలసముద్రంలో స్థాపించిన ఠాణు నాయక్ విగ్రహాన్ని త్వరలో ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు ఠాణు నాయక్ విగ్రహాన్ని బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ ఈనెల 20న జరగనున్న ఠాణు నాయక్ 72వ వర్ధంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఠాణు నాయక్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సంఘాల నాయకులు జైసింగ్ రాథోడ్, పుసింగ్ చౌహాన్, బానోతు వెంకన్న, బాదావత్ బాలాజీ, చెనాబాబు నాయక్, నునావత్ జవహర్, మాలోతు భిక్షపతి, లునావత్ దేవర్‌నాయక్, సత్య నాయక్, సమ్మయ్య నాయక్, రాము నాయక్, మల్సూర్, రవీందర్, సిద్ధు, ఫణి, బోడ కిషన్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు చీఫ్ విప్ భరోసా

హన్మకొండ అర్బన్: ఇటీవల ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో నగరంలోని వడ్డెపల్లి ముదిరాజ్ వీధికి చెందిన బలుసుకూరి కొమురయ్య పెంకుటిల్లు దగ్ధం అయింది. ఈక్రమంలో అధికారులతో కలిసి బాధితులను చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సీఐ షుకూర్, కార్పొరేటర్ ఇమ్మడి రోహిత్ రాజు, మాజీ కార్పొరేటర్ కేశబోయిన అరుణ, శ్రవణ్‌కుమార్, మట్టపల్లి రమేష్, సమ్మయ్య, డివిజన్ అధ్యక్షులు రామరాజు, ఆటో యూనియన్ నాయకులు బలుసుకూరి రవీందర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హక్కుల సాధనకు ఉద్యమించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బీసీ 'ఏ' కులాలు హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని వరంగల్ జిల్లా గంగపుత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ పాక వెంకటేశ్వర్లు సూచించారు. హనుమకొండలోని కాకతీయ కాలనీలోని గంగాగార్డెన్‌లో విద్యార్థులు, యువత, రీసెర్చ్ స్కాలర్స్‌ల బీసీ 'ఏ ఐక్య కులాల ఉద్యమ సమితి ప్రథమ సమావేశం గైని రాజేందర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ కమిషన్‌ను ముదిరాజ్‌లు రాజకీయంగా ప్రభావితం చేస్తూ బీసీ'ఏ' గ్రూపులో చేరేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా బీసీ 'ఏ' కులాల ఐక్య కార్యాచరణ' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకుడు సాయిబాబా, గోపు సుధాకర్, డాక్టర్ సనత్, పాక శ్రీనివాస్, చంద్రగిరి నర్సింహస్వామి, ఆనందం, పల్లెపు సమ్మయ్య, కొదిరిపాక ఆనంద్, కుర్న వెంటేశ్వర్లు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రుణాలు అందించాలి

కాళోజీ సెంటర్: బీసీలకు ప్రభుత్వం రుణాలు అందించడం లేదని, బీసీల రుణాల కోసం పోరాటం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరబోయిన సాంబయ్య పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం కందిమల్ల మహేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ ఓబీసీ పల్లెపల్లెకు ఓబీసీ కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లాలని, అందుకు ప్రతి కార్యకర్త పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, నాయకులు ప్రదీప్‌రావు, కుసుమ సతీష్ బాబు, గంట రవికుమార్, పార్లమెంట్ కో కన్వీనర్ అల్లం నాగరాజు, జిల్లా నాయకులు బాకం హరిశంకర్, పొట్టి శ్రీనివాస్ గుప్తా, కనుకుంట్ల రంజిత్, గిరిదర్, పంజాల రాము, గోకే వెంకటేశ్, పోశాల సతీష్, ఎం.యాదగిరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాంబయ్య

సంక్షేమ శాఖలకు నిధులేవి?

వరంగల్ రూరల్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేయాలనే లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు నిధులు ఇవ్వకుండా, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా ఆయా శాఖలను నిర్వీర్యం చేస్తోంది. సంక్షేమ శాఖలకు సవతితల్లి ప్రేమ కనబరుస్తుందనడానికి జిల్లాలోని సంక్షేమ శాఖ తీరు ఇందుకు నిదర్శనం. స్వయం సహాయ సంఘాలకు డీఆర్‌డీఏ, సెర్ప్, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలకు చెందిన బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయనే తప్పా.. సంక్షేమ శాఖలకు నిధులు విడుదల చేయకుండా దాటవేత వైఖరిని అవలంబిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. శాఖల వారీగా నిధులు కేటాయింపు ఇలా ఉంది.

మైనార్టీ సంక్షేమ శాఖకు..

సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలుగా ప్రభుత్వం గుర్తించిన మైనార్టీ సంక్షేమ శాఖకు ఐదు సంవత్సరాలుగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఉన్న ఓబీఎంఎంఎస్ సైట్‌ను కూడా ప్రభుత్వం మూసివేసింది. మైనార్టీ విద్యార్థులకు కేవలం పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు మాత్రమే మంజూరు చేస్తుంది. విదేశీ విద్యకు 2021 సంవత్సరలో 21 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఆరుగురి విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి రూ.10లక్షల చొప్పున నిధులు విడుదల చేసింది.

గిరిజన అభివృద్ధి శాఖలో..

జిల్లాలో 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను ఎకనామిక్ సపోర్టు స్కీం (ఈఎస్ఎస్) జిల్లాలో 1,08,798 జనాభా కలిగి ఉన్న గిరిజనులకు 2020–21 సంవత్సరంలో 181 మంది లబ్ధిదారులకు రూ.1.98 కోట్లను కేటాయించింది. 2021–22 సంవత్సరంలో 937 మంది లబ్ధిదారులకు రూ.7.49కోట్లు కేటాయించింది. 2020–21, 2021–22 సంవత్సరాలకు 118 మంది లబ్ధిదారులకు రూ.9.48 కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయలేదు.

ఎస్సీ కార్పొరేషన్‌లో..

జిల్లాలో 2020–21 ఆర్థిక సంవత్సరానికి గాను ఎకనామిక్ సపోర్టు స్కీం (ఈఎస్ఎస్) కింద భూమి కొనుగోలు పథకం (ఎల్‌పీఎస్)లో భాగంగా 448 యూనిట్లకు గాను రూ.19.27 కోట్ల ఆర్థిక లక్ష్యంతో వార్షిక ప్రణాళిక ఆమోదించింది. అన్‌స్కిల్డ్ కేటగిరీ కింద 137 యూనిట్లకు సబ్సిడీ రూ.3.77 కోట్లను మంజూరు చేసింది. కాని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను కలెక్టర్ ఆమోదంతో ఎంపీడీఓల ద్వారా లబ్ధిదారులకు రెండు లోన్ అకౌంట్లు తెరిచే ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. కాని లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు.

స్కిల్డ్ కేటగిరీ కింద ...

2020–21 సంవత్సరానికి జిల్లాలోని 15 మండలాల్లో 130 మంది లబ్ధిదారులకు రూ.6.58 కోట్ల సబ్సిడీ చెల్లించాల్సి ఉండగా, కేవలం 68 యూనిట్లకు రూ.2.65కోట్లు చెల్లించినట్లు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు లెక్కలు చూపుతున్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదు.

పైలట్ ప్రాజెక్టు మినీ డైయిరీ ...

2018–19వ సంవత్సరం ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద వరంగల్ జిల్లాలో మినీ పైలట్ ప్రాజెక్టు కింద ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా చెన్నారావుపేట, దుగ్గొండి, నర్సంపేట రూరల్, అర్బన్, ఖానాపూర్ మండలాల్లో 435 మంది లబ్ధిదారుల 2+2 గేదెలు కొనుగోలుకు రూ.17.40 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది.

సెక్యూరిటీ సూపర్‌వైజర్లకు సర్టిఫికెట్ల ప్రదానం

మడికొండ: దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్ శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సబిత ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ జయశ్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సబిత మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న 21 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డబ్ల్యూడీసీడబ్ల్యూ ఆర్‌జేడీ ఝాన్సీరాణి, విజయశ్రీ, సిబ్బంది హేమరాణి, మంజుల, హఫీజ్, కల్యాణ్, బాబు పాల్గొన్నారు.



అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సబిత, జయశ్రీ తదితరులు

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే పేపర్ లీక్



వరంగల్ చౌరస్తా: సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్



హసన్‌పర్తి: కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరంగల్ చౌరస్తా: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగా టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్లు లీకేజీ అయ్యాయని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్‌తో దర్యాప్తు జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అగ్ని ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అకాల వర్షానికి వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈక్రమంలో రైతులు, బాధిత ప్రజలను ఆదుకోవాలని సూచించారు. సమావేశంలో నగర కార్యదర్శి గడ్డం నాగార్జున, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగెల్లి కొమురయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఐతం నాగేష్, రాయినేని ఐలయ్య, గోవర్ధన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీక్‌పై కాంగ్రెస్ ఆందోళన

హసన్‌పర్తి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఆందోళన చేపట్టింది. ఈమేరకు హసన్‌పర్తి ప్రధాన రహదారిపై నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మంత్రి కల్వకుంట్ల తారక రామారావు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లీక్‌లో కేటీఆర్ పీఏ హస్తముందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, దూడల ప్రకాష్, బాబు, మధుసూదన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, బల్సుకూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పుల్లా రవీందర్, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవీందర్ పాల్గొన్నారు.

రామనాథం సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న అతిథులు

ఖిలా వరంగల్: తెలంగాణ ఉద్యమ నేత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామనాథం సార్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకుడు గంట రవికుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కదారి భోగేశ్వర్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ కొనియాడారు. వరంగల్ ఫోర్ట్ రోటరీ క్లబ్ భవనంలో తాళ్లపల్లి రామనాథం, సులోచన దంపతుల ప్రథమ వర్ధంతి సభ ఆదివారం జరిగింది. రామనాథం దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నేతలకు రామనాథం మార్గదర్శకులుగా నిలిచారు. సబ్బండ జాతిని ముందు నడిపించిన మహనీయుడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది తీగల జీవన్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్, రవి, గుర్రం రవి, కుమారస్వామి, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బెల్లంకొండ రమేష్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

'సీపీ, ఎమ్మెల్సీ' ఫ్లెక్సీకి పాలాభిషేకం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) ఏవీ.రంగనాథ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు (మూగ) నోముల వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం పాలాభిషేకం చేశాడు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి కుటుంబీకులు మీడియాతో మాట్లాడారు. వేణుగోపాల్‌రెడ్డికి చెందిన 30 గుంటల వ్యవసాయ భూమి విషయంలో కొన్నేళ్లుగా పొరుగు వారితో నెలకొన్న వివాదాలు గ్రామంలో ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించినా పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సూచన మేరకు సీపీ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ క్రమంలో సీపీ ఆదేశాలతో డీసీపీలు మురళీధర్, పుష్ప, ఏసీపీలు తిరుమల్, శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో విచారణ చేసి సీపీకి నివేదిక అందించడంతో భూమి వేణుగోపాల్‌రెడ్డికి దక్కిందని చెప్పారు. దాంతో తమ భూమి తమకు దక్కిందంటూ వారికి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబీకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగుడు